ప్రజాశక్తి
శనివారం 25, మార్చి 2023
5
అనంతపురం



లింగ నిర్ధారణ నిర్మూలనకు చర్యలు

అనంతపురం కలెక్టర్ : జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు పూర్తిగా నిర్మూలించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం జిల్లా స్థాయి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులతో కలెక్టర్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో భ్రూణ హత్యల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. లింగ వివక్షను చూపే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడ్షినల్ సుపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నాగేంద్రుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వీరబ్బాయి, జిల్లా నోడల్ అధికారి యుగంధర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు సుజాత, చెన్నకేశవులు, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ హనుమన్న, ఆర్‌డిటి డైరెక్టర్ సిరెప్ప, రెడ్స్ సంస్థ భానుజా, హెడ్స్ డైరెక్టర్ విజకుమార్, డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు పాల్గొన్నారు.

జరిమానాలు పిండేశారు..

200 శాతం వసూళ్లు
రవాణా శాఖ ఆదాయం రూ.189.80 కోట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రవాణా శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో జరిమానాలను పిండేసింది. లక్ష్యానికి మించి 200 శాతం అధికంగా జరిమానాలు వేసి వసూలు చేయడం గమన్హాం. తక్కిన వాటిల్లో మాత్రం అనుకున్న లక్ష్యంలో వెనుకబాటు ఉంది. అనంతపురం జిల్లాలో రూ.206 కోట్లు లక్ష్యం కాగా రూ.189.80 కోట్లు చేరుకోవడం జరిగింది. మొత్తం ఐదు విభాగాల్లో రవాణ శాఖకు ఆదాయం సమకూరుతోంది. త్రైమాసిక పన్నులు, లైఫ్ ట్యాక్సు, సర్వీస్ ఛార్జీలు, జరిమానాలు, ఫీజుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 89 శాతం లక్ష్యం చేరుకున్నారు.

జరిమానాల్లో 200 శాతం వసూళ్లు

2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.11.60 కోట్లు అనంతపురం జిల్లా లక్ష్యం కాగా, రూ.24.59 కోట్లు వసూలు చేశారు. నిర్ధేషిత లక్ష్యంలో 211 శాతం చేరుకుంది. మొత్తం ఆదాయం పరంగా చూసినప్పుడు 89 శాతం వరకు చేరింది. రూ.189 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. మొత్తం లక్ష్యాల్లో జరిమానాల్లోనే లక్ష్యం చేరుకోగా తక్కిన అన్నీ లోటు ఉన్నాయి. అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం ఆరు లక్షల వాహనాలు ఉన్నాయి. ఇందులో 70 వేల ట్రాన్సుపోర్టు వాహనాలు ఉన్నాయి. 4.60 లక్షలు ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. 40 వేలు ప్రయివేటు వాహనాలు ఉన్నాయి. తక్కిన 30 వేలు అలైడ్ వాహనాలు ఉన్నాయి. వీటిల్లో చూసినప్పుడు త్రైమాసిక వాహనాల ద్వారా రావాల్సిన ఆదాయం రూ.54.64 కోట్లు లక్ష్యం కాగా, రూ.38.66 కోట్లు ఆదాయం వచ్చింది. 70 శాతం లక్ష్యం చేరుకున్నారు. లైఫ్ ట్యాక్సు ద్వారా రూ.119.19 కోట్లు లక్ష్యం కాగా రూ.89.99 కోట్లు కాగా 75 శాతం లక్ష్యం చేరుకున్నారు. సర్వీసు ఛార్జీల రూపంలో రూ.16.23 కోట్లు లక్ష్యంగా రూ.11.09 కోట్లు చేరుకున్నారు. మొత్తంగా చూసినప్పుడు ఈ ఆర్థిక సంవత్సరంలో 89 శాతం లక్ష్యాలను చేరుకున్నారు.

లక్ష్యానికి చేరువవుతాం..

ఈ ఏడాది ఆర్థిక లక్ష్యం చేరువయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంకా వారం రోజులు సమయముంది. ఆ లోపు మరింత ఆదాయం సమకూరే అవకాశముంది. అన్ని విభాగాల్లోనూ గతేడాది కంటే మెరుగ్గా ఆదాయం పెంపుదలకు చర్యలు తీసుకున్నాం. చివరకు 90 శాతానికిపైగా ఆదాయం సమకూరుతుంది.

- శివరాం ప్రసాద్, డిప్యూటీ ట్రాన్సుపోర్టు కమిషనర్

ఇదేనా స్వచ్ఛ ఆంధ్ర..!

ఢిల్లీ నుంచి..గల్లీ వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతినిత్యం స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ హిందూపురం.. అని ఉచ్చరిస్తున్నారు. అయితే హిందూపురం పట్టణంలో మాత్రం ఇది మాటలకే పరిమితమైంది. హిందూపురంలో పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న ప్రయివేటు బస్టాండులో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు అక్కడ ఉన్న ఖాళీ ప్రదేశంలోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం కంపుకొడుతోంది. దీనిని భరించలేక ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం.

కంపుకొడుతున్న పురం బస్టాండ్
పట్టించుకోని మున్సిపల్ అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం ఆధీనంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రయివేటు బస్టాండ్ ఉంది. ఈ బస్టాండ్ నుంచి నిత్యం వేలాది మంది రాక పోకలు సాగిస్తుంటారు. పాలకులు ఈ బస్టాండ్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరుతో నామకరణం చేయడంతో పాటు అక్కడ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అధికార పార్టీ వేడుకలతో పాటు ప్రతి ఏటా వైఎస్ఆర్ జయంతి, వర్ధంతి, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే బస్టాండులో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలం అయ్యారు.

టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో మరుగుదొడ్ల నిర్వహణ కోసం ఓ గుత్తేదారుకు స్థలాన్ని కేటాయించారు. తానే స్వయంగా మరుగుదొడ్ల నిర్మాణం చేసుకోవడంతో పాటు నిర్వహణ బాధ్యతనూ అప్పగించారు. అయితే ఆ సమయంలో అక్కడ ఉన్న కూరగాయాల మార్కెట్ శిథిలం కావడంతో ఆ స్థలంలో నూతన మార్కెట్ నిర్మాణం చేపట్టాలని దానిని కూల్చారు. మార్కెట్ పక్కన ఉన్న మరుగుదొడ్లకు సైతం వేరే స్థలం కేటాయిస్తామని గుత్తేదారుకు చెప్పారు. నష్ట పరిహారంగా విధించిన గడువును పెంచి ఇస్తామని చెప్పి దానిని కూల్చారు. ఆ సమయంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలోని శిథిలావస్థలో ఉన్న మరో మరుగుదొడ్ల భవనాన్ని వారికి కేటాయించారు. అయితే ఇటీవల పురపాలక సంఘ స్థలంలో సిండికేట్ ఫార్మా సొసైటీ వారు నిర్మాణం చేసిన భవనాలను పురపాలక సంఘం వారు స్వాధీనం చేసుకుని వాటిని కూల్చివేశారు. పక్కనే ఉన్న మరుగుదొడ్ల భవనాన్ని సైతం కూల్చారు. ఇంకా గడువు ఉందని.. ఇదే ప్రాంతంలోనే మరుగుదొడ్ల నిర్మాణానికి మరో స్థలాన్ని కేటాయిస్తామని గుత్తేదారుడికి భరోసా ఇచ్చారు. నిర్మాణం చేపట్టడానికి అధికారులు స్థలాన్నీ కేటాయించారు. అయితే సదరు గుత్తేదారుడు ఇంతవరకు కేటాయించిన స్థలంలో మరుగుదొడ్ల కోసం భవన నిర్మాణం చేపట్టలేదు. దీనికి ప్రధాన కారణం ఆ ప్రాంత కౌన్సిలర్ అడ్డుకోవడమే అని తెలుస్తోంది. దీంతో సదరు గుత్తేదారుడు మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రయాణికులు ఖాళీ స్థలంలోనే మూత్ర విసర్జన చేస్తుండడంతో ఆ ప్రాంతం కంపుకొడుతోంది.



హిందూపురం బస్టాండ్ ఆవరణంలో మూత్ర విసర్జన చేస్తున్న దృశ్యం

గుత్తేదారు ముందుకు రావడం లేదు

పరిగి బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ కోసం గుత్తేదారుడికి స్థలాన్ని కేటాయించాం. అయితే ఆ గుత్తేదారుడు మరుగుదొడ్ల భవన నిర్మాణం చేపట్టడానికి ముందుకు రావాడం లేదు. గుత్తేదారులతో చర్చించి, భవన నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. అంతవరకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తాం.

- మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

నేడు మహిళా సాధికారత సదస్సు

జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి



మాట్లాడుతున్న ఎస్‌పి ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు రాయదుర్గం మండలం 74-ఉడేగోళంలోని మద్దానేశ్వరస్వామి కల్యాణమండపం నందు శనివారం ఉదయం మహిళా సాధికారత సదస్సు జరగనున్నట్లు జిల్లా ఎస్‌పి డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి తెలిపారు. శుక్రవారం ఆయన మద్దానేశ్వరస్వామి సముదాయ భవనం, రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం జరగనున్న సదస్సులో రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ ఎవి.శేష సాయి, జస్టిస్ రమేష్, జస్టిస్ శ్యామసుందర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో బాల్య వివాహ నిరోధక చట్టం, విద్యా హక్కు చట్టం, మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అంతేకాక జిల్లాలో నెలకొన్న జోగిని సమస్య పట్ల కూడా అవగాహన కల్పిస్తారన్నారు. 39 మంది జోగినిలకు శాశ్వత భూహక్కు పథకం కింద పట్టాలను పంపిణీ చేస్తారన్నారు. ఆర్డీటీ సంస్థ సహకారంతో ఒక్కో గృహానికి రూ.3 లక్షలు చొప్పున 39 మంది లబ్ధిదారులకు పక్కా ఇళ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్ల మెగా చెక్కును ఈ సదస్సులో విడుదల చేస్తారని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తారన్నారు. జస్టిస్ రమేష్ రాయదుర్గం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అయినందున పూర్వ విద్యార్థుల సహకారంతో గురువులకు సన్మానం, పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరుగుతుందన్నారు. జిల్లాలోని పోలీసు, న్యాయ, రెవెన్యూ శాఖల సంయుక్త పర్యవేక్షణలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. మహిళలు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని, చట్టాల పట్ల అవగాహన కలిగివుండాలని ఎస్పీ కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అకాల వర్షాలకు, వడగండ్లకు పంట నష్టపోయిన రైతులను గురించి పంట నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జెడి చంద్రా నాయక్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి అధికారుల సమావేశానికి జేసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రబి 2022-23 సంవత్సరానికి సంబంధించిన సామాజిక తనిఖీల్లో భాగంగా ప్రతి ఆర్‌బికెలో జాబితాను ప్రదర్శించాలన్నారు. ఉద్యాన వన, పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి వారం రోజుల్లో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులు వివరాలు సకరించి వాటిని సామాజిక తనిఖీలు చేసి ప్రదర్శించాలన్నారు. ఏదైనా ఫిర్యాదులు ఉంట తీసుకుని తుది జాబితాను జిల్లా కలెక్టర్ ఆమోదంతో ప్రభుత్వానికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కనీసం మద్ధతు ధరతో పప్పు శనగ పంటను ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. కావున ఆర్‌బికెలో నమోదు చేసుకున్నటు వంటి రైతులు కొనుగోలు కేంద్రాల్లో పప్పు శనగ పంటను విక్రయించాలని తెలిపారు. డిఎం మార్క్ ఫెడ్ వారు గోను సంచులు అవసరం ఉన్న చోట పంపించాలని ఆదేశించారు. జిల్లాలో అకాల వర్షాల కారణంగా పశువులు నష్టపోకుండా బ్యాంకు వారి సహకారంతో ఇన్సూరెన్స్ చేసే విధంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వారు చర్య తీసుకోవాలని తెలిపాలి. జెడిఏ చంద్రా నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ప్రగతి నివేదికలను సభ్యులకు తెలిపారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను గుర్తించి వాటి వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలియజేయడం జరిగింది. సిహెచ్‌సి ద్వారా ట్రాక్టర్ దాని పనిముట్లను, ఇతర యంత్ర పరికరాలను రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు తీసుకొని ఆర్‌బికె లకు గ్రూపుల ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

5న చలో ఢిల్లీకి కార్మిక, కర్షకులు తరలివెళదాం
రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి



బెలుగుప్పలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు, బెలుగుప్ప, రాయదుర్గం, కళ్యాణదుర్గం

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలని, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి అందరూ తరలి వెళ్లి జయప్రదం చేద్దామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య పిలుపునిచ్చారు. సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతా శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలురైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించని దుస్థితి నెలకొందన్నారు. అత్యంత ధనవంతులైన ఆదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగి తేలుతూ దేశ రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురు తిరగకుండా ఉండేందుకు మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగానూ, ప్రయివేట్ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందన్నారు. మోడీ విధానాలను తూచా తప్పకుండా పాటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరు చాలా బాధాకరమని అన్నారు. ఇటు వంటి ప్రజా వ్యతిరేక విధానాలకు బదులుగా ప్రజానుకూల విధానాల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, కర్షక, పోరాట ప్రదర్శనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శివశంకర, రామయ్య, రాజేశ్వరమ్మ, వెంకటమ్మ, సోమశేఖర్, సరస్వతి, వలీ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతా శుక్రవారం రాయదుర్గం చేరుకుంది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ అధ్యక్షతన జరిగిన జీపు జాతాలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు రాష్ట్ర నాయకులు నాగభూషణం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, ఎటువంటి షరతులు లేకుండా కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇచ్చి పంట రుణాలు, నష్టపరిహారం, పంటల బీమా సబ్సిడీ ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, వాటర్ వర్క్స్ కార్మికులందరిని క్రమబద్ధం చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకై ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకుడు నాగరాజు, శంకర్, తిమ్మరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్, వంశీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతా శుక్రవారం బెలుగుప్ప మండల కేంద్రానికి చేకుంది. నాయకులు మాట్లాడుతూ.. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూ నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వాలని, అసైన్డ్ సీలింగ్ భూములను పేదలకు పంచిపెట్టాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు, నష్టపరిహారం, బీమా పరిహారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు నాగభూషణం, సిఐటియు మండల కార్యదర్శి భీమన్న, ప్రజానాట్యమండలి కార్యదర్శి శ్రీనివాసులు, హమాలీ యూనియన్ అధ్యక్షులు మారెన్న, పాతన్న, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన 'మీ భూమి'ని పూర్తి చేయండి : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : సిఎం వైఎస్ జగన్ మహాయజ్ఞంగా చేపడుతున్న 'మీభూమి మాహామీ' కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ంలోని మేయర్ ఛాంబర్‌లో శుక్రవారం మీ భూమి మా హామీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష కార్యక్రమం ద్వారా శాశ్వతంగా భూ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. నగరంలో కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో సమన్వయం చేసుకుని వేగవంతంగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని సూచించారు. అదేవిధంగా సిఎం జగన్ సహకారంతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కృషితో నగరంలోని సర్వే నెంబర్ల క్రోడీకరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు అబుసాలేహా, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, మునిశేఖర్, వైసిపి నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఖాజా, రామాంజనేయులు, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులుతోపాటు టౌన్ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువతి మృతికి కారకులను శిక్షించాలి

పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా- కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

దళిత యువతి రమాదేవిని హత్య చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేశం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని చెరువులో నార్పల మండల పరిధిలోని బొందలవాడ ఎస్సీ కాలనీకి చెందిన చెందిన నారాయణస్వామి, నారాయణమ్మ కుమార్తె రమాదేవిని (23) శవమై తేలింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తమ కుమార్తెను హత్య చేసి చెరువులో వేశారని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ముందు జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలి తల్లిదండ్రులు, బంధువులు మాట్లాడుతూ నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామానికి చెందిన జాఫర్ అనే వ్యక్తి తమ కుమార్తె ప్రేమ పేరుతో మోసం చేసి హత్య చేశాడని ఆరోపించారు. తమ కుమార్తె కనిపించలేదని 20రోజుల క్రితం నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పోలీసులు నిర్లక్ష్యం చేసినందువల్లే ఈ ఘోరం జరిగిందని వాపోయారు. ఇప్పటికైనా నిందితుడిని కఠినంగా శిక్షించకపోతే ఆందోళన విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. వీరి ఆందోళనకు కెవిపిఎస్ మద్దతు ప్రకటించి బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.వెంకటేష్ మాట్లాడుతూ టిటిసి చదివి ఓ ప్రయివేటు పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న యువతిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన చెరువులో పడేయడం బాధాకరమన్నారు. బాధితులు ఫిర్యాదు చేసిన 20 రోజులకు శవాన్ని బహుమానంగా ఇవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఎస్సీ, ఎస్టీల ప్రాణాలంటే అంత చులకనా అని ప్రశ్నించారు. రమాదేవిని చంపిన నిందితునిపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా చేస్తే సమస్యను పక్కదారి పట్టించేందుకు పరిహారం అంశాన్ని ముందుకు తీసుకురావడం బాధాకరమన్నారు. వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి నిందితుడు జాఫన్‌ను కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఆర్‌డిఒ మధుసూదన్, తహశీల్దార్ మోహన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో చర్చించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయ సహకారాలతోపాటు నిందితుడిని కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు సి.తిరుపాలు, బాలపెద్దన్న, ఎస్సీ, ఎస్టీ, జెఎసి సాకే హరి, చిన్న ఆంజనేయులు, చంద్ర కొర్రపాడు నాగేంద్ర, వెంకటేష్, రామకృష్ణ, గణేష్‌నాయక్, మంజునాథ, ఓబులేష్, కుళ్లాయప్ప, రామాంజనేయులు, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఎర్రిస్వామి, రాజా, జీవ, బాధిత కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదన్

ప్రజాశక్తి
www.prajasakti.com

27న చక్కెర మిశ్రమ బియ్యం వేలం

నార్పల : మండల పరిధిలోని గుగుడు గ్రామంలో వెలిసిన గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో భక్తులు చదివింపులు చదివించిన 5వేల కిలోల చక్కెర మిశ్రమ బియ్యం ఈనెల 27న ఆలయ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి శోభ, ఆలయ పాలకవర్గ కమిటీ ఛైర్మన్ శివశంకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునేవారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు.

విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 6, 11వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రుద్రాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హత కలిగిన విద్యార్థినులు ఈనెల 28 నుంచి ఏప్రిల్ 20వతేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

నివారణ దినోత్సవంలో వక్తలు



రాయదుర్గంలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తే పూర్తిగా నివారించవచ్చని పలువురు వైద్యులు సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో నుంచి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మాధవి, డాక్టర్ జ్ఞానసుధా, టిబి విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ జెండా ఊపి ప్రారంభించారు. వినాయక కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉంటే గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు లభిస్తాయన్నారు. రోగికి వ్యాధి నయమయ్యే వరకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం రోగి ఖాతాకు ప్రతినెలా రూ.500 జమ చేస్తుందన్నారు. ధూమపానం మద్యపానం చేసే వారికి, ఎయిడ్స్, మధుమేహ వ్యాధిగ్రస్తులకు క్షయ ఎక్కువగా సోకే అవకాశాలు ఉన్నాయన్నారు. కావున వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిబి విభాగం సూపర్‌వైజర్ సత్యనారాయణ, శ్రీకాంత్‌నాయక్, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్‌బాబు, శశి, కళావతి, ఆరోగ్య సహాయకులు శ్రీనివాసులు, ఐ సిటిసి కౌన్సిలర్ కృష్ణమూర్తి, అల్తాఫ్, నీలకంఠ, నర్సింగ్ సూపరింటెండెంట్ రమణమ్మ, దంత వైద్యురాలు శ్రీలత, నర్సులు ఆశావర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది, మాస్ ఎడ్యుకేషన్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ, వైద్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా నేమకల్లు, ఉంతకల్లు, ఉద్దేహాల్, దేవగిరి, లింగదహాల్, శ్రీధర్‌గట్ట, గోనేహాల్, గోవిందవాడ, దర్గాహొన్నూరు, బల్లలగుడ్డం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.

నార్పల : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవిశంకర్, వైద్యాధికారులు విజయమ్మ, విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సూర్య కళావతి, సచివాలయ సిబ్బంది రాంకీ, అమరా పుల్లయ్య, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, సబిహా సుల్తానా, ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, సీహెచ్ఒ చంద్రావతి, సూపర్‌వైజర్ బాబాసాహెబ్, ఒపి సిబ్బంది, ఎఎన్ఎంలు మహేశ్వరి, అలివేళమ్మ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ప్రీతి, ఆశాలు పాల్గొన్నారు.

ఉరవకొండ : సరైన చికిత్సతోపాటు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే క్షయవ్యాధిని నివారించవచ్చని లయన్స్ క్లబ్ గవర్నర్ చంద్రప్రకాష్‌రావు తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉరవకొండ లయన్స్ క్లబ్ కార్యాలయంలో అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి సాహితీ, లయన్స్‌క్లబ్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ట్రెజరర్ నజీర్, రీజినల్ ఛైర్మన్ బాలచంద్ర, గణేష్‌బాబు, ప్రభాకర్‌నాయుడు, చిట్టా శ్రీధర్, నాగేశ్వరరావు, ప్రభాకర్, నాయుడు, జయకృష్ణ, సురేంద్ర, వైద్య సిబ్బంది మహేష్, నిమ్మల వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో క్షయ వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఉరవకొండ : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుకుని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి లయన్స్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్తూరు ఆరోగ్య విస్తరణ అధికారి జాఫర్, ఫార్మాసిస్ట్ బాలకృష్ణ, సూపర్‌వైజర్ కుళ్లాయమ్మ, లాబ్ టెక్నీషియన్ మాణిక్యాల రావ్, కైలాసం, హెల్త్ అసిస్టెంట్లు నిమ్మల వెంకటేష్, ఎస్.మోతీలాల్‌నాయక్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీ, మాలాశ్రీ, సుమలత, హెల్త్ ప్రొవైడర్స్ ఆనంద్‌నాయక్, శమంతకమణి, సులోచన, మమత పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గార్లదిన్నె -1లో పని చేస్తున్న ఆశాకార్యకర్త సుబ్బమ్మ, మర్తాలు-2 పరిధిలో పని చేస్తున్న నాగమణిని సన్మానించారు. ఈ కార్యమానికి టిబి సూపర్‌వైజర్ సునీర్‌బాషా, వైద్యులు షమీన్‌తాజ్, సిహెచ్ఒ లోకనాథ, పిహెచ్ఎన్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, సూపర్‌వైజర్లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వృద్ధుడి ఆత్మహత్య

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు గ్రామానికి చెందిన పుల్లా శంకరయ్య (62) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శంకరయ్య భార్య 8 నెలల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతునికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నటుల ఎఎస్ఐ గురుమూర్తి తెలిపారు.

కుక్కర్ మూత తగిలి మహిళకు గాయాలు

గుత్తి : మండలంలోని కె.ఉబిచెర్ల గ్రామంలో శుక్రవారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కుక్కర్ మూత తగిలి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ ఇంట్లో కుక్కర్‌లో పప్పు చేస్తుండగా ప్రెజర్ ఎక్కువై కుక్కర్ మూత ఎగిరిపడి మొహానికి తగిలింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆమెని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

2514 మెట్రిక్ టన్నులు పప్పుశనగ కొనుగోలు

అనంతపురం : నాఫెడ్ సహకారంతో 2154 మెట్రిక్ టన్నుల పప్పుశెనగ రైతులు నుంచి ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేసినట్లు మార్కుఫెడ్ మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు నుంచి సేకరించిన పప్పుశెనగకు 204 మంది రైతులకు రూ.2.17 కోట్లు నిధులు విడుదల చేయాలని నాఫెడ్ కు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపినట్లు తెలిపారు.

గౌరసంద్ర మారెమ్మ అమ్మవారికి పూజలు

బెలుగుప్ప : మండల కేంద్రంలో వెలిసిన గౌరసంద్ర మారెమ్మ తల్లికి శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దీపారాధనలు, పూజలు నిర్వహించారు. రాత్రికి భజన ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కలు తీర్చుకున్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘాల పరిధిలోని సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టులకు అర్హులైన వారు ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 3, 4, 5, 11, 12, 13, 17వ సచివాలయాలో 10 వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కావున 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రానున్నది టిడిపి ప్రభుత్వమే..

పుట్లూరు : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఎపి మాంసాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ చంద్రదండు ప్రకాష్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్, రైతులు, నిరుద్యోగ ఉద్యోగ భద్రతకు భరోసా కావాలంటే చంద్రన్న విజయం చారిత్రాత్మక అవసరం అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్తలు కష్టపడాలని పిలుపునిచ్చారు.

విలువలతో కూడిన వైద్యాన్ని అందించాలి

ఎపి మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ ఎస్‌వికె



హౌస్ సర్జన్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజలకు విలువలతో కూడిన వైద్యాన్ని అందించినప్పుడే మంచి మానవత్వం ఉన్న వైద్యులుగా స్థిరపడతారని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు డాక్టర్ ఎస్‌వికె ప్రసాద్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మెడికల్ కళాశాలలోని సెంట్రల్ హాల్‌లో 'వైద్యవృత్తిలోని విలువలు' అన్న అంశంపై హౌస్ సర్జన్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా హౌస్ సర్జన్ కోర్సు పూర్తి చేసుకుని డాక్టర్లుగా సమాజంలో సేవలు అందించబోతున్న వందమంది హౌస్ సర్జన్లకు ఎథిక్స్ సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కోట్లు సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఎన్ని లక్షల మంది పేదలకు మన వైద్యంతో జీవితాన్ని ప్రసాదించామన్నదే ముఖ్యమన్నారు. అయితే విలువలు పాటిస్తూ వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆరేపల్లి శ్రీదేవి, అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎల్ సుబ్రహ్మణ్యం, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, హౌస్ సర్జన్లు, సూపర్ స్పెషాలిటీ న్యూరాలజిస్టులు భాస్కర్, రవితేజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి, పరదేశీనాయుడు, అకడమిక్ సిబ్బంది మస్తాన్ బాబా, వాణీ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

పెద్దపప్పూరు : మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలు మేరకు మండల పరిధిలోని టిడిపి నాయకులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయకులు గ్రామాలకు వెళ్లి ప్రజలను కలుసుకుని సమస్యలు తెలుసుకోవాలని ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారన్నారు. దీంతో తాము ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే నేడు చాగల్లు, సింగనగుట్టపల్లి ఎంపిటిసి గ్రామాల పరిధిలో ఇంటింటికీ వెళ్లనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగంపల్లి సర్పంచి గంగమ్మ, రాజు, నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాబు, వెంకటనారాయణరెడ్డి, సాంబుడు, శంకర, తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని వినతి

అనంతపురం : రెండేళ్ల క్రితం పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కలెక్టర్ ఉత్తర్వు ఇచ్చారని, అయినా ఇవ్వలేదని రూరల్ మండల పరిధిలోని అలమూరు గ్రామానికి చెందిన టి.లక్ష్మన్న జాయింట్ కలెక్టర్‌ను శుక్రవారం కలిసి విన్నవించారు. ఈమేరకు వ్యవసాయ సలహా మండలి సమావేశానికి హజరైన జెసి కేతన్‌గార్గ్‌ను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నాడు. అలమూరు పరిధిలోని సర్వే నంబర్ 303-1లో 66 సెంట్ల భూమి ఉందన్నారు. దీంతోపాటు మరో 80 సెంట్ల భూమి ఉందన్నారు. కావున వెంటనే పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరారు. ఇందుకు జెసి స్పందిస్తూ తక్షణం సమస్యను సంబంధిత విఆర్ఒతో తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా పిజెఆర్ పుట్టినరోజు

గుత్తి : పీజేఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, టిడిపి నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గుత్తి మండలానికి చెందిన టిడిపి నాయకులు ఆయన నివాసానికి వెళ్లి కేక్ కోయించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు కరిడికొండ సూరి, తెలుగు యువత నాయకుడు సుధాకర్ నాయుడు, దాస రాము, దాస రమేష్, రమణ, చిరంజీవి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని గొందిపల్లి గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయ ఇనాం భూములను అర్చకుడు రవికుమార్ అక్రమంగా తన ఆధీనంలో ఉంచుకున్నాడని ఆలయ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ మహబూబ్‌బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పాండురంగ స్వామి, ఆదినారాయణ, శివశంకర్, శ్రీరాములు మాట్లాడుతూ గొందిపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి సర్వే నంబర్ 317,322లోని 36 ఎకరాల భూమిని 1935లో తమ పూర్వీకులు ఇనాంగా ఇచ్చారన్నారు. అయితే జక్కలచెరువు ఆలయ అర్చకుడు రవికుమార్ తమ గ్రామంలోని ఆలయానికి సంబంధించిన మాన్యం భూములు అంటూ 18 ఎకరాలను కౌలుకు ఇచ్చి అక్రమంగా అనుభవిస్తున్నాడని ఆరోపించారు. అయితే రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ రికార్డులో మాత్రం భూములు ఎవరి అనుభవంలో లేనట్టుగా చూపుతున్నాయని తెలిపారు. తగిన ఆధారాలు లేకుండా అర్చకుడు రవికుమార్ అక్రమంగా భూములు తన ఆధీనంలో ఉంచుకున్నాడని, వెంటనే తమకు అప్పగించాలని తహశీల్దార్‌ను కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ తమ రికార్డుల ప్రకారం ఆ భూములు దేవాదాయ శాఖకు చెందినవిగా ఉన్నాయన్నారు. గ్రామస్తులు, అర్చకుడి మధ్య ఉన్న సమస్యను దేవాదాయ శాఖ అధికారులే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఓబుళపతి, రామకృష్ణ, రంగస్వామి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని కందికాపుల గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ యుగానందరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అటెండెన్స్, మూమెంట్, స్పందన రిజిస్టర్లు పరిశీలించారు. రోజుకు సచివాలయం ద్వారా ఎన్ని సేవలు అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సస్తిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన గర్భిణులు, 0 నుంచి ఐదేళ్లలోపు పిల్లలు, 6 నుంచి 19 సంవత్సరాల పిల్లల వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని బాటసుంకులమ్మ తిరుణాలను పురస్కరించుకుని భూమిరెడ్డి ఫార్మర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపిడిఒ యోగానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రైతులు, పేదల అభ్యున్నతే ధ్యేయంగా ఫార్మర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఎన్నో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. ఇందులో భాగంగానే తిరుణాల జరుగే రెండు రోజులపాటు అన్నదానాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు.

ఎన్‌వైకె ఆధ్వర్యంలో పలువురికి సత్కారం

అనంతపురం : వివిధ రకాల సేవలు అందిస్తున్న వారిని ఎన్‌వైకె ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. శుక్రవారం కేంద్ర మంత్రిత్వ యువజన వ్యవహారాల శాఖ, స్పోర్ట్స్ భారత ప్రభుత్వం ఆధ్వర్యవంలో జిల్లా లెవెల్ నైబర్హుడ్ యూత్ పార్లమెంట్-2023 కేంద్ర ప్రభుత్వం జి.20 థీమ్‌లో భాగంగా స్థానిక ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా వివిధ రకాల సంస్థల ద్వారా సేవలందిస్తున్న ఎన్‌వైకె వారు ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా ఎన్ఎస్ఎస్ ద్వారా ఉత్తమ సేవలందిస్తున్న ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నగరూరు రసూల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ఎస్‌కెయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్‌రావు, ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత భరత్, ఎన్‌వైకె శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

ఉరవకొండ : 33వ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో బాలికల విభాగంలో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులను ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా రూ.15వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే షటిల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్య, వైద్య సేవ కార్యక్రమాలతోపాటు క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రీడా దుస్తులు, క్రీడా సామగ్రి, భోజన వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉరవకొండ లయన్స్ క్లబ్ గవర్నర్ ప్రారంభించారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతన్నలు



విద్యుత్ ఎఇకి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు మండల కేంద్రంలోని విద్యుత్‌స్టేషన్‌ను శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని పి.సిద్దిరాపురం, వడ్డిపల్లి, సనప సబ్‌స్టేషన్ల పరిధిలో 9 గంటల కరెంటు సరఫరా చేస్తున్నప్పటికీ ఆత్మకూరు సబ్‌స్టేషన్‌లో మాత్రం 7 గంటలు మాత్రమే ఇస్తున్నారు. అదేమని అడిగితే పవర్ లోడ్ ఉండడం వల్ల సరఫరా చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ట్రాన్స్‌కో ఎఇకి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు ఎఇ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆవుల రాజశేఖర్‌రెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, ఆవుల పోతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, బైపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు 'పది' పునాది



విద్యార్థులకు మొమెంటోలు అందజేస్తున్న దృశ్యం

గుత్తి : విద్యార్థులకు పదో తరగతి ఉన్నత చదువులు చదివేందుకు పునాది లాంటిదని శ్రీసాయి డిగ్రీ కళాశాల క్యాంపస్ సీఈవో ఎ.శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ అన్నారు. ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ మాదిరి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్థానిక పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం రఘురాం, మహర్షి దయానంద గురుకులం కరస్పాండెంట్ విద్యా, ఎవిఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ జానీ, కెఎస్‌కె ట్యూషన్ల నిర్వాహకుడు కె.సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు దేశాయి నాగరాజు, జయరాజ్, మోహన్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గౌతమ్‌నాయక్, నాయకులు కృష్ణ, పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

తాడిపత్రి : సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను అర్హులందరికీ అందజేయాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 12వ వార్డు సచివాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎంతో ఉన్నతాశయంతో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా సిబ్బంది అర్హులందరికీ న్యాయం చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది బాగా పని చేస్తే దేశంలో ఆదర్శంగా నిలుస్తారన్నారు. అందుకు అనుగుణంగా సిబ్బంది పని చేయాలన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు నాయకులు వికె.వెంకట్రామిరెడ్డి మృతి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో సుదీర్ఘ కాలం పని చేసిన వికె.వెంకట్రామిరెడ్డి శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపం తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ వికె వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభ రోజుల్లో విద్యార్థి యువజన సంఘాల్లో చురుకుగా పని చేసిన వెంకట్రామిరెడ్డి అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారని తెలిపారు. తాడిపత్రి ప్రాంతంలో జరిగిన అన్ని ప్రజా పోరాటాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. చీమలవాగు పల్లెలో జన్మించిన ఆయన చివరి వరకు కమ్యూనిస్టుగా జీవించారన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన చీలికలో ఆయన సిపిఐ వైపు నిలిచిన కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలను సమానంగా ఆదరించారన్నారు. ఉద్యమాభివృద్ధికి అవసరమైన ప్రతి సందర్భంలో తగిన సలహాలు, సూచనలు, విమర్శలు చేసేవారని రాంభూపాల్ గుర్తు చేసుకున్నారు.

సీనియర్ జర్నలిస్టు మృతికి నివాళి

ఉరవకొండ : సీనియర్ జర్నలిస్ట్, ఎపి ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి నివాళులర్పించారు. శ్రీనాథ్‌రెడ్డి గత బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మృతిచెందడంతో స్వగ్రామం కడప జిల్లా సింహాద్రిపురం మండలం కోవరంగట్టపల్లి గ్రామానికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న విశ్వేశ్వరరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, విడపనకల్ జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి : సిడిపిఒ

నార్పల : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిడిఒ భారతి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బొందలవాడ అంగన్‌వాడీ కేంద్రంలో బొందలవాడ సెక్టార్ సూపర్‌వైజర్ మధుమాలిని ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 3 వరకు పక్షోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి.. పౌష్టికాహారం, చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు తృణీత, వెంకటలక్ష్మి, తులశమ్మ, ఆదినారాయణమ్మ, శ్రీదేవి, సుజాత, పార్వతీ సుధామణి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని గవ్వలవీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో కూడా నార్పల సెక్టార్ సూపర్‌వైజర్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు

ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి



దుకాణాల్లో దాడులు నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని దుకాణదారులు ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌ఛార్జి కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. ఇందులో భాగంగా నగరంలోని పలు దుకాణాల్లో సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. నగరంలోని రాజు రోడ్డులో ఉన్న మహావీర్, మహాలక్ష్మి ప్లాస్టిక్ దుకాణాల్లో విక్రయిస్తున్న ప్లాస్టిక్ వస్తువులను సీజ్ చేసి ఒక్కో దుకాణానికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ విక్రయిస్తే మొదటి విడత రూ.10వేల జరిమానా, రెండోసారి లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఎక్కడా వ్యాపారం చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ సిబ్బంది, అకౌంట్ సెక్షన్ విభాగాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న నిర్మాణ పనులను త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం ఉండరాదని ఇంజినీర్లను ఆదేశించారు. అంతకుమునుపు ఉదయం నగరపాలక ఆరోగ్యాధికారి గంగాధర్‌రెడ్డి, డిఇ రాంప్రసాద్‌తో సమావేశం నిర్వహిస్తూ క్లాప్ ఆటోల కేటాయింపు, ఇతర పారిశుధ్య పనులపై పలు సూచనలు చేస్తూ నగర పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే సాయంత్రం టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ప్లానింగ్ కార్యదర్శులతో నగరపాలక సమావేశ మందిరంలో సమావేశమై పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన అంశాలపైన వివరాలను తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఇ సతీష్‌చంద్ర, ఇఇలు రామ్మోహన్‌రెడ్డి, నగరపాలక కార్యదర్శి సంఘం శ్రీనివాసులు, ఎంహెచ్ఒ గంగాధర్‌రెడ్డి, సిఒలు శానిటేషన్ సెక్రటరీలు, డిఇలు, ఎఇలు, తదితరులు పాల్గొన్నారు.